www.netifocusnews.com

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

## తెలంగాణ జిల్లాలు

గురువారం 05, సెప్టెంబర్ 2024 | పేజీలు: 04







# సీసీఎస్‌కు పట్టుబడిన వడ్ల లారీలపై కేసు లేదట!

- అనుమానాస్పదంగా సివిల్ సప్లయ్, పోలీసు అధికారుల పనితీరు..
- లారీలను తప్పించేందుకు వడ్ల మాఫియా ముమ్మర ప్రయత్నాలు..
- పట్టుబడింది పామాపురంలో.. కోస్గి నుంచి వస్తున్నట్లుగా చెబుతున్న అధికారులు

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పామాపురం గ్రామంలో బుధవారం వనపర్తి జిల్లా సీసీఎస్ పోలీసులు రెండు వరి ధాన్యం లారీలను అదుపులోకి తీసుకున్నారు. ఆత్మకూరు మండలంలోని ఒక రైస్ మిల్లు నుంచి ప్రభుత్వ వరి ధాన్యాన్ని అక్రమంగా కర్నూల్‌కు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వనపర్తి సీసీఎస్ పోలీసులు కాపు కాసి వడ్ల లారీలను పట్టుకున్నారు. పట్టుబడిన వడ్ల లారీల డ్రైవర్ల దగ్గర ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీసీఎస్ పోలీసులు కొత్తకోట పోలీసులకు రెండు వడ్ల లారీలను అప్పగించారు. కొత్తకోట ఎస్ఐ మంజునాథ్ రెడ్డి, సివిల్ సప్లయ్ అధికారులు సంయుక్తంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా బుధవారం రాత్రి 8గంటల వరకు వడ్ల లారీలపై ఎలాంటి కేసు గానీ, చర్యలు గానీ తీసుకోలేదు. సివిల్ సప్లయ్ అధికారులు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని పోలీసులు చెబుతుండగా సివిల్ సప్లయ్ అధికారులు మాత్రం వడ్ల లారీలు కోస్గి మార్కెట్ నుంచి రైతుల పేరుతో వడ్ల లారీలను మిగతా 2లో..



# జర్నలిస్టుల ఇంటి స్థలాలపై సందిగ్ధం

- గత ప్రభుత్వ హయాంలో 82మంది జర్నలిస్టులకు స్థలాల కేటాయింపు
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తొలి నాళ్లలోనే ప్లాట్ల రాళ్లు తొలగింపు
- జర్నలిస్టులు ఫిర్యాదు చేసినా.. రాళ్ల తొలగింపు దుండగులను గుర్తించని పోలీసు శాఖ
- అర్హులకు న్యాయం చేస్తామన్న ఎమ్మెల్యే హామీకి కార్యరూపమెప్పుడో?

2లో..


# పేదింటి ఆడపిల్లలకు అండగా రాష్ట్రానికి పెద్ద కొడుకులా సీఎం రేవంత్..



- ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి

పాలకుర్తి ఫోకస్ న్యూస్ ప్రతినిధి, సైదులు-సెప్టెంబర్ 04 :

నేడు కొడకండ్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో కొడకండ్ల మండలానికి సంబంధించిన 81 మంది లబ్ధిదారులకు రూ.81,09,396/- విలువగల కళ్యాణ లక్ష్మి షాది మిగతా 2లో..



# జర్నలిస్టుల ఇంటి స్థలాలపై సందిగ్ధం..

- గత ప్రభుత్వ హయాంలో 82మంది జర్నలిస్టులకు స్థలాల కేటాయింపు
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తొలి నాళ్లలోనే ప్లాట్ల రాళ్ల తొలగింపు
- జర్నలిస్టులు ఫిర్యాదు చేసినా.. రాళ్ల తొలగింపు దుండగులను గుర్తించని పోలీసు శాఖ
- అర్హులకు న్యాయం చేస్తామన్న ఎమ్మెల్యే హామీకి కార్యరూపమెప్పుడో?



వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్
(జి.శ్రీనివాస యాదవ్ జగత్ పల్లి)

వనపర్తిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇంటి స్థలాల కేటాయింపులో గత కొంతకాలంగా సందిగ్ధం నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో వివిధ దిన పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో జర్నలిస్టులుగా పనిచేసే వారికి అప్పటి మంత్రి నిరంజన్ రెడ్డి సుమారు 82 మందికి 165 గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తూ పట్టాలు అందజేశారు. ఇందుకోసం రాళ్లు, రప్పలతో కూడిన గుట్టను చదును చేసేందుకు సొంత నిధులు వెచ్చించి ప్లాట్లకు హద్దులను ఏర్పాటు చేయడంతో పాటుగా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని 30 అడుగుల వెడల్పు ఉండే రోడ్లను ఏర్పాటు చేసి జర్నలిస్టులకు అందించడంతో జర్నలిస్టులంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. నిరుపేద జీవనం గడుపుతూ సామాజిక బాధ్యతగా, జర్నలిస్టుగా విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ అవినీతి అక్రమాలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులంతా సంబరపడుతున్న క్రమంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఇంటి స్థలాల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

## అసలు ఏమైంది..?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొందరు గుర్తుతెలియని దుండగులు జర్నలిస్టులకు కేటాయించిన ప్లాట్ల రాళ్ళను రాత్రికి రాత్రి తొలగించారు. ప్లాట్ల రాళ్ళను తొలగిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు కొందరు జర్నలిస్టులు రాత్రి సమయంలోనే ప్రాణాలకు తెగించి దుండగులను పట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. జర్నలిస్టుల రాకను గమనించిన దుండగులు తాము వచ్చిన వాహనాలను అలాగే వదిలి పారిపోవడంతో జర్నలిస్టులు దుండగుల వాహనాలను స్వాధీనం చేసుకొని ఫోటోలతో సహా వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ లో అప్పగించి దుండగులపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి సుమారు 9 నెలలు కావస్తున్నా ఎమ్మెల్యే మేఘారెడ్డిని అప్పటి కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నా రెడ్డిని కలిసి విన్నవించినా దోషులు ఎవర నేది మాత్రం నేటికీ తేలకపోవడంతో రాజకీయంగా పలుకుబడి ఉన్న బలమైన నాయకులే జర్నలిస్టుల ఇండ్ల స్థలాలపై కన్నేసి తతంగం నడిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎక్కడైనా ఒక చిన్న దొంగతనం జరిగితే ఆగమేఘాల మీద స్పందించే నాయకులు, ప్రజా ప్రతినిధులు, పోలీసులు జర్నలిస్టుల స్థలాల రాళ్లను తొలగించిన వారిని ఎందుకు గుర్తించడం లేదో అంతుచిక్కడం లేదు.



## అనుమానాలులెన్నో..?

జర్నలిస్టులకు ఇంటి స్థలాల కేటా యింపు రాళ్ళను తొలగించిన క్రమంలో కొందరు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవి స్తే పొంతన లేని సమాధానాలతో జర్నలిస్టులలో అనుమానాలు రేకెత్తించారు. తహసిల్దార్ తప్పుడు పత్రాలు ఇచ్చాడని, ఇంటి స్థలాల కేటాయింపుకు రికార్డులు లేవని విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ల లేదని, ఆర్డీఓకు సమాచారం చెప్పలేదని, ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని ఇలా తోచిన రీతిలో వ్యాఖ్యానిస్తుండడంతో జర్నలిస్టులలో కొందరు నాయకుల అధికారుల తీరుపై అసహనం, అసంతృప్తి పెరిగింది. ఒక తహసిల్దార్ ఒక్కరికి లేదా ఇద్దరికీ పట్టాలు ఇస్తే దానిని తప్పు పట్టవచ్చు కానీ 80మందికి పైగా జర్నలిస్టులకు పట్టాలు ఇస్తే పై అధికారులెవ్వరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుం డా సుమారు 6ఎకరాల స్థలాన్ని జర్నలిస్టులకు కేటా యించే ధైర్యం, సాహసం ఎవరు చేస్తారనేది ఎందుకు గుర్తించలేకపోతున్నారు జర్నలిస్టులే ఆశ్చర్యపోతున్నారు.

## ఎమ్మెల్యే హామీకి కార్యరూపమెప్పుడో..?

జర్నలిస్టులకు కేటాయించిన ఇంటి స్థలాల విషయంలో ఎమ్మెల్యే హామీ ఎప్పుడు కార్యరూపంలోకి వస్తుందోనని చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యే వద్ద ఇంటి స్థలాల గురించి ఎవరు ప్రస్తావించినా త్వరలోనే న్యాయం చేస్తామని చెబుతున్నారే తప్పితే ఒక్క అడుగు కూడా ముందుకు పడుతున్నట్లుగా కనిపించకపోవడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో విలేకరులకు భోజనాలు ఏర్పాటు చేసినప్పటికీ ప్లాట్ల కేటాయింపులో ఎమ్మెల్యే చొరవ తీసుకోవడం లేదంటూ జర్నలిస్టులు ప్రెస్ మీట్ చూసుకుని భోజనం చేయకుండానే తిరిగి వెళుతుండడంతో అక్కడున్న నాయకులు కలగజేసుకొని ఎమ్మెల్యేతో మాట్లాడించారు. అయినప్పటికీ గతంలో మాదిరిగానే నెల, రెండు నెలల్లో అర్హులను గుర్తించి న్యాయం చేస్తామని చెప్పడంతో ఎమ్మెల్యే పాతపాటే పాడారని జర్నలిస్టులు అసహనం వ్యక్తం చేశారు.

## అనర్హులను తొలగించవచ్చు.!

ఇంటి స్థలాల కేటాయింపులో కొందరు అనర్హులు ఉంటే తొలగించవచ్చని వర్కింగ్ జర్నలిస్టులు బాహాటంగానే చెబుతున్నారు. అయితే గతంలో ఇచ్చిన జర్నలిస్టులలో కొందరు అనర్హులు ఉన్నారనే ఉద్దేశంతో ఎమ్మెల్యే ప్లాట్లు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోలేకపోతున్నారనే కొందరు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలోనే సీనియర్లతో చర్చించి అనర్హులను తొలగించి అర్హులకు ప్లాట్లు కేటాయిస్తే బాగుంటుందనే అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమవుతోంది. ఏదిఏమైనా గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలు, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోపే జర్నలిస్టులు అయోమయంలో పడడం కాంగ్రెస్ పట్ల జర్నలిస్టులలో ఉన్న సానుకూలత విముఖతగా మారే అవకాశం ఉంది. అందుకే త్వరితగతిన ఎమ్మెల్యే అడుగులు వేస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు.

# సీసీఎస్ పోలీసులకు పట్టుబడిన వడ్ల లారీలపై కేసు లేదట!

(మొదటి పేజీ తరువాయి..)

తీసుకువస్తున్నట్లు చెబుతున్నారు. టీఎస్ 06 యుబి 1406, ఏపీ 24 టిబి 2099 నెంబర్ గల లారీలు పట్టు బడింది పామాపురం గ్రామంలో అయితే అధికారులు మాత్రం కోస్గి నుంచి వస్తున్నట్లుగా చెబుతుండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది . వాస్తవంగా వడ్ల లారీలు కోస్గి నుంచి వచ్చినట్లయితే జాతీయ రహదారి మీదుగా రావాల్సి ఉంటుంది. పట్టుబడిన సమయంలో అనుమతి పత్రాలు లేకపోయినప్పటికీ సాయంత్రం వరకు అధికారులు మాట మార్చి కోస్గి నుంచి వడ్లను తీసు కువస్తున్నట్లుగా చెప్పడం పలు అనుమానాలకు తావి స్తుంది. ఆత్మకూరు మండలంలోని పామాపురానికి అతి సమీపంలో ఉన్న ఒక గ్రామంలోని రైస్ మిల్లు నుండి వరి ధాన్యాన్ని లోడ్ చేసుకుని అక్రమంగా బయటికి తరలి స్తున్నట్లు తెలుస్తుంది. సివిల్ సప్లయ్ అధికారులు మొదట గా కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారణ చేయాల్సి ఉన్నప్పటికీ వారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారులను లారీల యజమానులు మేనేజ్ చేసి కాగితా లు సృష్టించి కేసు నుండి తప్పించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక చొరవ తీసుకుని లారీలు ఎక్కడి నుంచి వచ్చాయి అనే విషయంపై క్షేత్రస్థాయిలో సమగ్రం గా విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు కోరుతు న్నారు. ఇదే విషయమై కొత్తకోట ఎస్ఐ మంజునాథ్ రెడ్డిని వివరణ కోరగా సివిల్ సప్లయ్ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు పోలీస్ స్టేషన్‌లో ఇవ్వలేదని తామే సివిల్ సప్లయ్ అధికారులకు లారీల విషయంపై సమాచారం ఇచ్చామని తెలిపారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పేద ఇంటి ఆడపిల్లలకు అండగా..

(మొదటి పేజీ తరువాయి..)

ముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేసిన ఎమ్మెల్యే శ్రీమతి యశస్విని ఝాన్సి రెడ్డి కళ్యాణలక్ష్మి పథకాన్ని తొలుత దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రపోజల్ చేశారని, అదే పథకాన్ని గత పాలకులు కొనసాగించారని కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కాంగ్రెస్ పథకాలే అని ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి అన్నారు. బుధవారం కొడకండ్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీకి ముఖ్యఅతిథిగా హాజరై 81 మంది లబ్దిదారులకు కళ్యాణాలక్ష్మి షాది ముబారక్ చెక్కులు అందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి యశస్విని ఝాన్సి రెడ్డి మాట్లాడుతూ.గత ప్రభుత్వాల నాయకులు రాజకీయ కక్ష సాధింపుతో అర్హులైన లబ్ధిదారులకు పథకాలను అడ్డుకున్నారని అన్నారు, రానున్న కాలంలో పేదల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ప్రజల కండ్లల్లో ఆనందం చూడడమే ప్రధాన లక్ష్యం అని తెలి పారు, గత పాలకుల నిర్లక్ష్యపు పాలన వల్ల రాష్ట్ర ఖజా నాకు భారీగా దెబ్బ తినటంతో తులం బంగారం అందిం చలేక పోతున్నామని వారి దోపిడీని ఎండగట్టి పారదర్శక పాలన అందిస్తామన్నారు. రాష్ట్రంపై బీఆర్ఎస్ మోయలేని భారాన్ని వేసి ప్రజల భవిష్యత్ ను ప్రశ్నార్థకం చేసింద న్నారు. త్వరలోనే కళ్యాణ లక్ష్మి చెక్కులతో పాటుగా తులం బంగారం సైతం అందిస్తా మన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలతో నిరుపేదలు లబ్ధి పొందుతున్నారని, మా ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పార్టీ ముఖ్య నాయకులు, యూత్ నాయకులు, మహిళ నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

# మావోయిస్టు అగ్రనేత ఏసోబు ఎన్‌కౌంటర్





**వరంగల్ ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు, సెప్టెంబర్ 04:** వరంగల్ మావోయిస్టు పార్టీ అగ్ర నేత మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ దాదా రణదేవ్ ఛత్తీస్‌ఘడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. కేంద్ర మిలిటరీ ఇంచార్జ్, మహారాష్ట్ర ఛత్తీస్‌ఘడ్ బార్డర్ ఇంచార్జ్‌గా కొనసాగు తున్న రణదేవ్ స్వస్థలం హన్మకొండ జిల్లాలోని కాజీపేట మండలం టేకులగూడెం గ్రామం. 1980లో మావోయిస్టు ఉద్యమంలో చేరిన ఆయన అంచలంచెలుగా ఎదిగి కేంద్ర పార్టీలో కీలక స్థాయికి చేరుకున్నారు. మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో రణదేవ్ మృతి చెందినట్లుగా దంతెవాడ ఎస్పీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రణదేవ్ భార్య మాచర్ల లక్ష్మక్క గతేడాది అనారోగ్యంతో మృతి చెందింది. రణదేవ్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారు. రణదేవ్ మరణంతో ఆయన స్వస్థలం టేకులగూడెంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. ఛత్తీస్‌ఘడ్ నుంచి టేకులగూడెంకు ఆయన మృతదేహాన్ని తీసుకురానున్నట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు.



## పలుస శంకర్ గౌడ్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:
యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న పలుస శంకర్ గౌడ్ కు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించినట్లు రాష్ట్ర విద్యా శాఖ పక్షాన సమాచారం అందింది. మూడు దశాబ్దాలకు పైగా విద్యా శాఖకు ఆయన అందించిన సేవలకు గాను ఈ పురస్కారం లభించినట్లు తెలుస్తోంది.నేడు హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డ్ అందుకోబోతున్నారు.శంకర్ గౌడ్ పనిచేసిన ప్రతి పాఠశాలలలో అక్షరదీక్ష, విలువల విద్య,బాల సాహిత్య సభలతో పాటు సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడిగా వివిధ అంశాలకు సంబంధించిన దాదాపు ముప్పై వేల పుస్తకాలను సేకరించి పాఠశాల మరియు శాఖా గ్రంథాలయాలకు అందజేశారు.శంకర్ గౌడ్ కు అవార్డ్ రావడం పట్ల ఉపాధ్యాయులు,సంఘాల నాయకులు,సాహితీ వేత్తలు,కవులు, కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజలు మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవంగర ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు సెప్టెంబర్ 04



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డిఎంఎచ్ఒ మురళీధర్ అన్నారు. బుధవారం పెద్దవంగర గ్రామంలో మెడికల్ హెల్త్ క్యాంపులో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. వర్షాకాల నేపథ్యంలో టైఫాయిడ్, మలేరియా, డెంగీ లాంటి విష జ్వరాలు వస్తున్నాయని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, ఎంపిడిఓ వేణుమాధవ్, ఏంఎల్పిఎచ్, ఏఏన్ఏం,పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

# టీచర్స్ ట్రేనింగ్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

### టీచర్స్ ట్రేనింగ్ వర్క్‌షాప్ ను ఉదేశించి మాట్లాడుతున్న హైదరాబాద్ జిల్లా లైన్స్ క్లబ్ జిల్లా కోర్డినేటర్ నారాయణ





ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ సెప్టెంబర్ 4:
మనలో విజ్ఞానాన్ని సృష్టించే దేవుళ్లే ఉపాధ్యాయులని, హైదరాబాద్ జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ అమర్నాథ్ పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ సహకారంతో లైయన్స్ క్లబ్ హైదరాబాద్ జిల్లా కోర్డినేటర్ నారాయణ ఆధ్వర్యంలో బోయినపల్లి న్యూ సిటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆడిటోరియంలో సుమారు 54 మంది టీచర్లకు బుధవారం ఉచి తంగా టీచర్ ట్రెనింగ్ వర్క్ షాప్ నిరవహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా లైన్స్ క్లబ్ మొదటి గవర్నర్ అమర్నాథ్, హైదరాబాద్ జిల్లా లైన్స్ క్లబ్ రెండవ గవర్నర్ డాక్టర్ విజయ లక్ష్మి లు ముఖ్యతిథులుగా పాల్గొని వర్కుషాప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ... సమాజంలో అత్యున్నత స్థానం ఉపాధ్యాయులదేనన్నారు. ఉపాధ్యాయుడు విద్యార్థుల జీవితాలను మార్చగల శక్తివంతమైన వ్యక్తి అన్నారు. అందుకే, వారి ప్రవర్తన, వారి పాత్ర, మంచి ఉపాధ్యాయుడుగా ఉండడానికే ఈ వర్క్ షాప్ అని అన్నారు. ఉపాధ్యాయుడు కేవలం జ్ఞానాన్ని ఇచ్చే వ్యక్తి కాదని ప్రపంచానికే ఆదర్శవంతమైన మార్గదర్శకుడని తెలిపారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగడం ద్వారా వారిలో నమ్మకం పెరుగుతుందని చెప్పారు. విద్యార్థులను ప్రేమించాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రత్యేకమైని, వారిని వ్యక్తిగతంగా గుర్తించి, వారికి ప్రోత్సాహం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులకు ఉపాధ్యాయుడు ఒక రోల్ మోడల్ అన్నారు. విషయావగాహనతో పాటు విలువలు కూడా నేర్పించాలన్నారు. నిష్పక్షపాతంగా ఉండాలన్నారు.



ఉపాధ్యాయుడు ఎల్లప్పుడూ నేర్చుకుంటూనే ఉండాలని తెలుపుతూ ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాటశాలల ఉపాధ్యాయులు, పలువురు సంఘసేవకులు, లక్ష్మణ్, నాగేందర్, సురేష్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా మోమిన్ పేట్ పీ ఎస్ కమిటీ శాంతి సమావేశం

ఫోకస్ న్యూస్ ప్రతినిధి( స్టేట్ కోఆర్డినేటర్ భామిని రఘుపతి) సెప్టెంబర్ : 4
వికారాబాద్ జిల్లా మోమిన్ పెట్ పోలీస్ స్టేషన్లో సాయంత్రం నాలుగు గంటలకు పీస్ కమిటీ శాంతి సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మోమిన్ పెట్ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఉత్సవ కమిటీ సభ్యులు మరియు పెద్దలు పెద్ద ఎత్తున ఈ సమావేశానికి హాజరు అయినారు మరియు ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్, రెవెన్యూ డిపార్ట్మెంట్ అధికారులు హాజరైనారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మోమిన్ పెట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్ కుమార్, అధ్యక్షత వహించి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచనలు ఇచ్చినారు శాంతియుతంగా ప్రతిష్టించవలెను ఈ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో





పూజలు నిర్వహించి నిమజ్జనాన్ని ఎలాంటి అల్లర్లు జరగకుండా శాంతియుతంగా ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోమిన్ పెట్ ఎస్సై అరవింద్ గారు ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# అతి భారీ వర్షాల వల్ల కౌసర్ కోళ్ల ఫారం లో కోడి పిల్లలు మృతి

ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఆంజనేయ చారీ యన్.( సదాసిపేట) సెప్టెంబర్ : 4



సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని నిజాంపూర్ గ్రామ పరిధిలో గల ఎండి కౌసర్ కు చెందిన కోళ్ల ఫారంలో అతి వర్షాల కారణంగా 14000 కోడి పిల్లలు మృత్యువాత పడ్డాయి. తాసిల్దార్ సరస్వతి, ఆర్ ఐ అనంతయ్య, నిజాంపూర్ మాజీ ఎంపీటీసీ మాధవరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆర్ ఐ పంచనామా ప్రకారం 12 లక్షల రూపాయల ఆర్థిక నష్టం జరిగినట్లు గుర్తించారు. కోళ్ల ఫారం యజమాని కౌసర్ మాట్లాడుతూ ఈ నష్టపరిహారాన్ని ప్రభుత్వము తొందరగా గుర్తించి త ద్వారా జరిగిన విపత్తు నుంచి గట్టెక్కించాలని ఫోకస్ పత్రిక ద్వారా వ్యక్తం చేశారు.

# రైతులను ఆదుకోవడంలో విఫలమైన కాంగ్రెస్

### - బిజెపి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి

వేములపల్లి, సెప్టెంబర్ - 04 (నేటి ఫోకస్ న్యూస్)
వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో అకాల వర్షాల వరదలకు నష్టపోయిన రైతులను పరామర్శించి వరదకు కొట్టుకుపోయిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, బిజెపి కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర బిజెపి నాయకులు వీరెల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ అకాల వర్షాలు, వరదల కారణంగా నల్లగొండ జిల్లాలో దాదాపుగా 800 ఎకరాలలో పంట నష్టం జరిగింది. రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని వారు మండిపడ్డారు. వందల ఎకరాలలో ఇసుక దిబ్బలు ఏర్పడ్డాయని, కనీసం నష్టపోయిన రైతులను అంచనా కూడా వేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని తక్షణమే జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు మబ్బు నిద్ర వదిలి నష్టపోయిన పంట పొలాలను పరిశీలించాలని పంట నష్టం అంచనా వేయాలని నష్టపోయిన రైతులకు ఎకరాకు 25వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, రైతుల పొలాలలో ఏర్పడిన ఇసుక దిబ్బలను ప్రభుత్వ ఖర్చులతో తొలగించాలని తూములు, కాలువల మరమత్తులు చేయించాలని, సాగర్‌ఎడమ కాలువ కు లిఫ్ట్ లకు మరమ్మత్తులు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమాను అమలు చేయాలి అని, డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులు శీను, మహేష్, మాట్లాడుతూ ఏ ఒక్క అధికారులు గానీ ఏ పార్టీ నాయకుడు కానీ మమ్మల్ని పట్టించుకోవడంలేదని బాధను వ్యక్తం చేశారు. ఈ



కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు తుమ్మలపల్లి హనుమంత్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లం చర్ల అఖి, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, గాయం భరత్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు సీతారాం రెడ్డి, సత్యనారాయణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పెదమాం భరత్, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి పందిరి భాగ్యమ్మ, బిజెపి నియోజకవర్గ నాయకులు, పెద్ద బోయిన వెంకటేశ్వర్లు, శివశంకర్, నక్క శ్రీనివాస్, పెదమాం ప్రసాద్ వెంకటేశ్వర్లు, ఈట మహేష్, బట్టు మహేష్ గంగరాజు, నాగరాజు, అక్షయ్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన ఉద్యాన వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ మర్రి రాజశేఖర్

### మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య

పెద్దమందడి నేటి ఫోకస్ న్యూస్:

గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇచ్చే రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ములుగు లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ మర్రి రాజశేఖర్ ఎంపికయ్యారని మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య ఒక ప్రకటనలోతెలిపారు. బోధన, పరిశోధనలో సుమారు 26 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన డాక్టర్ మర్రి రాజశేఖర్ ఉద్యాన విద్యార్థులకు పీజీ, పీహెచ్డీ కోర్సులలో తోట పంటల్లో ఆధునిక పరిజ్ఞానం పై బోధిస్తున్నారని అన్నారు. గతంలో 15 సంవత్సరాలు పైగా ఏఐసిఆర్పి ఆన్ ఫ్రూట్స్, మూడు సంవత్సరాలకు పైగా పామ్ ఆయిల్ తోటల పై పరిశోధన చేసిన వారు అనేక టెక్నికల్ బులిటెన్లు, బుక్ చాప్టర్లు, ఉద్యాన పంటలకు సంబంధించిన అంశాలపై వ్యాసాలు రచించారని తెలిపారు. ముగ్గురు పిహెచ్డి



విద్యార్థులను, అలాగే 14 మంది పీజీ విద్యార్థులకు పరిశోధనలో మార్గదర్శకులుగా పనిచేయడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ లలో 60 పైగా పరిశోధనాత్మక వ్యాసాలు ప్రచురించారన్నారు. గతంలో ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు పొందిన డాక్టర్ మర్రి రాజశేఖర్ ఒక పేటెంట్ సైతం కలిగి ఉన్నారన్నారు. ప్రస్తుతం ములుగు ప్రధాన కేంద్రంగా గలిగిన శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో డీన్ ఆఫ్ హార్టికల్చర్, డీన్ , పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ తో పాటు పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్ ఇన్చార్జిగా, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలికి వర్సిటీ నుండి నోడల్ ఆఫీసర్ గా సేవలందిస్తున్నారని తెలిపారు. డాక్టర్ మర్రి రాజశేఖర్ కి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల తోటి ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



# పాఠశాలకు ఎలక్ట్రికల్ బెల్ వితరణ

పెద్దవంగర :ఫోకస్ న్యూస్ ప్రతినిది సైదులు సెప్టెంబర్ 04

మండలంలోని చిట్యాల ప్రాథమిక పాఠశాలలో బుధవారం దిశెట్టి బ్రదర్స్ వెంకటేష్, ప్రశాంత్ తమ స్వంత ఖర్చుతో 3 వెల రూపాయల విలువగల ఎలక్ట్రికల్ బెల్ ను పాఠశాలకు అందజేశారు. తాము చదుకున్న పాఠశాలకు ప్రతి సంవత్సరం తమ సొంత ఖర్చులతో వస్తురూపంలో బహుమతిని ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యాకయ్య,విజయ్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# సాయుధ పోరాటాల వారోత్సవాలను జయప్రదం చెయ్యాలి

### నల్లగొండ జిల్లా ఇంచార్జ్ గోనె కుమార స్వామి

మిర్యాలగూడ, సెప్టెంబర్ - 04 (నేటి ఫోకస్ న్యూస్)



ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎం.సి.పి.ఐ(యు) కమిటీ సమావేశం యాదగిరిపల్లి గ్రామంలో పోతు గంటి కాశి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎం.సి.పి.ఐ(యు) కేంద్ర కమిటీ సభ్యులు, నల్లగొండ జిల్లా ఇంచార్జ్ గోనె కుమార స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో మహోజ్వల పోరాటం అయిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ విప్లవ పోరాటం గురించి వివరించారు. 1946 నుండి 1951 వరకు సాగిన ఈ పోరాటంలో దాదాపు 5000మంది వీరులు వీరమరణం పొందారని, రైతంగా పోరాటం మన జాతీయ ఉద్యమ చరిత్రలో అపూర్వ స్థానాన్ని సంపాదించిందని అన్నారు. 3వేల గ్రామాలలో గ్రామ రాజ్యాలను భూస్వాములను గడీల నుండి ప్రజలు తరిమివేశారని, దొరల భూములను రైతాంగం స్వాధీనం చేసుకుని, 10లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. సెప్టెంబర్ 10 నుండి 17 వరకు జరగబోయే సాయుధ పోరాటాల వారోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భారీ వర్షాలు, వరదల వల్ల రాష్ట్రం ఎదుర్కొంటున్న పరిస్థితులను గోనె కుమా రస్వామి జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎం.సి.పి.ఐ(యు) నాయకులు వరికుప్పల వెంకన్న, వస్కుల మట్టయ్య, సూర్యాపేట జిల్లా కార్యదర్శి యస్.కే నజీర్, నల్లగొండ జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, ఉమ్మడి జిల్లా నాయకులు నేతి వేణు, ధీరవత్ మోహన్ నాయక్, సోమగాని వెంకన్న, రామాంజి జ్యోతి, గడ్డి వీరయ్య, వస్కు ల భరత్, వల్లమళ్ళ ఆశీర్వాదం, గుడుగుంట్ల మారయ్య, వస్కుల కిరణ్, ఇటమళ్ళ గురువయ్య పాల్గొన్నారు.

# ఘనంగా గురు జగ లింగేశ్వర ఆలయ వార్షికోత్సవం



### ఆలయాలు ధర్మానికి పునాది వంటివి

### ఆలయాలు భక్తులకు అన్నదాన కేంద్రాలుగా ఉండాలి

### బోర్డు ఉపాధ్యక్షులు జన్యావుల రామకృష్ణ

ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ సెప్టెంబర్ 04:

హిందూ ధర్మం ఎంతో విశిష్టతతో కూడుకున్నదని అందులో ఆలయాలు ధర్మానికి పునాది వంటివి, ఆలయాలు నిత్యం వేల మందికి కడుపునింపుతూ అన్నదాన కేంద్రాలు గా విరాజిల్లుతున్నాయని, కంటోన్మెంట్ బోర్డ్ ఉపాధ్యక్షులు జన్యావుల రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం కంటోన్మెంట్ 5వ వార్డు మహాత్మా గాంధీ నగర్ లో జరిగిన గురు జగ లింగేశ్వర ఆలయ వార్షికోత్సవంలో రామకృష్ణ పాల్గొని ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ ఆపద వచ్చినా ముందుగా ఆహారాన్ని అందించి ఆకలి తీర్చేవి దేవాలయాలేనని అన్నారు.



బంగ్లాదేశ్ లో జరిగిన అల్లర్లలో ఇస్కాన్ మందిరంలో విగ్రహాలు కాల్చి దేవాలయాన్ని పాక్షికంగా ధ్వంసం చేసినప్పటికీ వరదల్లో కొట్టుమిట్టాడుతున్న బంగ్లా దేశీయులకు ఇస్కాన్ ఆలయం అన్నం పెట్టి ఆదుకుందని గుర్తుచేశారు. ప్రస్తుతం విజయవాడ లో వరదల్లో చిక్కుకున్న వారికి కనక దుర్గమ్మ ఆలయం ఆహారాన్ని అందిస్తూ కడుపునింపుతుంది.

ఇలా అనేక దేవాలయాలు దేశంలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా కొన్ని లక్షల మందికి ఆహారాన్ని అందిస్తున్నాయని అందుకే మన ఆలయాలు మన గుర్తింపు అని మన ఆలయాలను కాపాడుకుంటే మన ధర్మం నిలబడుతుంది, ధర్మం నిలబడితే అందరం సుభీక్షంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ 5 బిజెపి నాయకులు విజయ్, సోమ శేఖర్, ఆలయ కమిటీ సభ్యులు మల్లప్ప, బాబు, వెంకటప్ప, హనుమంతు, భగవంతు, లింగప్ప, బీమప్ప, రిక్షా మల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

# నామకరణ మహోత్సవానికి హాజరైన నారాయణఖేడ్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే

ఫోకస్ న్యూస్ ప్రతినిధి( స్టేట్ కోఆర్డినేటర్ బామిని రఘుపతి) సెప్టెంబర్ :4



సంగారెడ్డి జిల్లా నాగల్గిద మండలంలోని మావినెల్లి గ్రామంలో మాల్పటేల్. నాగిశెట్టి కుమారుని నామకరణ మహోత్సవానికి నారాయణఖేడ్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శ్రీ మహా రెడ్డి భూపాల్ రెడ్డి హాజరై వారి ఆతిథ్యాన్ని స్వీకరించడం జరిగినది. మాజీ ఎమ్మెల్యే నాగిశెట్టి కుటుంబ సభ్యులు శాలువాతో సన్మానించడం జరిగినది.

# పాములపాడు పిహెచ్సి ని పరిశీలించిన డిఎంహెచ్వో పొట్ల శ్రీనివాస్

మాడుగులపల్లి, సెప్టెంబర్ - 04 (నేటి ఫోకస్ న్యూస్)



మాడుగులపల్లి మండలంలోని పాములపాడు పిహెచ్సి ని బుధవారం డిఎంహెచ్వో పొట్ల శ్రీనివాస్ పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య సిబ్బందికి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ప్రజలు సీజనల్ వ్యాధులు రాకుండా వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు పెరిగే విధంగా గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించాలని అన్నారు. వారి వెంట డిప్యూటీ డిఎంహెచ్వో గీతా వాణి, పిహెచ్సి డాక్టర్ సత్యనారాయణ, కార్తీక్, భార్గవి, సి హెచ్ ఓ మోతిలాల్, హెచ్ఈఓ వెంకన్న రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.